




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు నంద్యాల
శుక్రవారం | 27 జూన్ 2025
పేజీలు 8

### శ్రీశైలం డ్యామ్ పై ముగిసిన
# అండర్ వాటర్ వీడియోగ్రఫీ

- సీలయన్ ఆఫ్షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో సర్వే
- డ్యాం ముందు భాగాన ఏర్పడిన గొయ్యి లోతు, విస్తీర్ణంపై 13 రోజుల పాటు వీడియో చిత్రీకరణ
- మూడు వారాల్లో ప్రాజెక్ట్ అధికారులకు పూర్తి నివేదికలు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం డ్యామ్ భద్రతపై జలాశయం ముందు భాగంలో ఏర్పడిన భారీ గొయ్యి (ప్లంజ్‌పూల్)ను పరిశీలించేందుకు వచ్చిన అండర్ వాటర్ వీడియో గ్రఫి టీమ్ సర్వే గురువారంతో ముగిసింది.ప్లంజ్ ఫుల్ నందు పరిస్థితిని అత్యాధునిక కెమెరాలతో అండర్ వాటర్ వీడియోలు మిగతా 2లో




- నంద్యాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ
- కార్యక్రమంలో పాల్గొన్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ,ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా చేయాలంటే సమిష్టి కార్యాచరణ అవసరమని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. గురువారం నంద్యాలలో మాదవద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాల ఆధ్వర్యంలో ఎస్పీజీ గ్రౌండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం కూడలి వరకు మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని నిర్వహించి మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం అనేది సమాజాన్ని శారీరకం గా, మానసికంగాను, ఆర్థికంగా నాశనం చేస్తుందని అన్నారు. మిగతా 2లో

### డ్రగ్‌ను జిల్లా నుండి పారద్రోలాలంటే
# సమిష్టి కార్యచరణ అవసరం



మాదకద్రవ్యాలను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# శ్రీశైలం డ్యాంకు భారీగా వరద

- జూరాల నుంచి 1,01,459 క్యూసెక్కుల వరద నీరు
- 863.10 అడుగులకు చేరిన నీటిమట్టం

**శీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు.కాగా కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలానికి వరద నీటి ప్రవాహం భారీగా ప్రవహిస్తుంది.దీంతో డ్యామ్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 863.10 అడుగులకు చేరుకుంది.ప్రస్తుతం రిజర్వాయర్లో 115.7856 టీఎంసీల నీరు నిల్వగా ఉంది.


శ్రీశైలం డ్యాంలో నీటి దృశ్యం

# జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- ఘనంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రావాణా వ్యతిరేక దినోత్సవం
- రాజ్‌విహార్ నుండి కలెక్టరేట్ వరకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న రేంజ్ డిఐజి,కర్నూలు జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ,ఎంపి,మేయర్,అధికారులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, డిఐజి

### ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలో
# కర్నూలు, నంద్యాల జిల్లాకు చోటు..!

- రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జి కొండప్ప
- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కండే శ్యాంసుందర్ లాల్ ఏకగ్రీవ ఎన్నిక
- హర్షం వ్యక్తం చేసిన కర్నూలు, నంద్యాల జిల్లా జర్నలిస్టులు


ఖండే శ్యాంసుందర్ లాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు


గోరంట్ల కొండప్ప, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు

### మున్సిపల్,సచివాలయ ఉద్యోగులకు
# షోకాజ్ నోటీసులు

- రూ.3,27,17,209లు వెంటనే వసూలు చేయాలి
- కర్నూలు కమీషనర్ రవీంద్రబాబు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 52వార్డుల్లో ట్రేడ్ లైసెన్స్ డబ్బులు వసూలు చేయని 17 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, 132మంది సచివాలయ ఉద్యోగులకు మున్సిపల్ కమీషనర్ రవీంద్రబాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 52వార్డుల్లో గత ఏడాది, ఈ ఏడాది పెండింగ్‌లో ఉన్న మిగతా 6లో


కర్నూలు కమీషనర్ రవీంద్రబాబు

### చిరుత పులుల సంచారంతో
# భయం..భయం..!

-సున్నిపెంట శివారు ప్రాంతాల్లో భయాందోళన చెందుతున్న ప్రజలు
-అప్రమత్తంగా ఉండాలన్న అటవీశాఖ అధికారులు


చిరుతపులి అడుగు దృశ్యం,


చిరుతపులి సంచరిస్తున్న దృశ్యం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:**శ్రీశైల మండల కేంద్రమైన సున్నిపెంట గ్రామం శివారు ప్రాంతాల్లో చిరుత పులుల సంచారంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. చీకటి పడితే చాలు మిగతా 2లో

# డ్రగ్‌ను జిల్లానుంచి పారద్రోలాలంటే సమిష్టి కార్యాచరణ అవసరం

(మొదటి పేజి తరువాయి)

ముఖ్యంగా యువత తప్పుదోవ పట్టే అవకాశం ఉందని అన్నారు. మాదకద్రవ్యాల నివారణకు పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈగల్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ బృందం డ్రగ్ ముఠాలకు వ్యతిరేకంగా నిరంతరం నిఘా కొనసాగిస్తుందని, డ్రగ్స్ ఎవరు అమ్ముతున్నారు. ఎవరు కొంటున్నారు, ఎక్కడి నుంచి వస్తుంది, తదితర పూర్తి వివరాలు సేకరిస్తుందని అన్నారు. ఇప్పటి వరకు 37 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 47 మంది ముద్దాయిలను రిమాండ్‌కు పంపడం జరిగిందని తెలిపారు. మాదక ద్రవ్యాలను అమ్మిన, కొన్న చట్ట ప్రకారం కఠినంగా శిక్షించడంతో పాటు డ్రగ్స్ తీవ్రతను బట్టి వారి ఆస్తులను కూడా జప్తు చేయడం జరుగుతుందని అన్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలైన విజిలెన్స్, ఈగల్, డ్రగ్ కంట్రోల్‌తోపాటు పోలీసులు బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులు, ఏజెన్సీలలో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పది మెడికల్ షాపులపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఉమెన్ అండ్ చైల్డ్ డైరెక్టర్ లీలావతి, పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు

# శ్రీశైలం డ్యామ్ పై ముగిసిన అండర్ వాటర్ వీడియోగ్రఫీ

(మొదటి పేజి తరువాయి)

తీసేందుకు ఈనెల 10 న విశాఖప ట్నంకు చెందిన సీలయన్ ఆఫ్షోర్ డైవింగ్ టీమ్ ఎం.డిసూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో సుమారు 16 మందితో టీమ్ తో జలాశయం వద్దకు చేరుకొని అత్యాధునిక కెమెరాలతో నీటి అడుగు బాగంలోని అండర్ వాటర్ లోకి వెళ్లి ప్లంజ్ పుల్‌లో ఏర్పడిన భారీ గొయ్యికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను చిత్రీ కరించారు. ఇప్పటికే నీటిలో ఉన్న సిమెంట్ స్టీల్ కాంక్రీట్ సిలిండర్లు కొన్ని బాగా దెబ్బ తిన్నట్లు వీడియో గ్రఫి ద్వారా వీడియోలు బయటకు వచ్చాయి. డ్యామ్ పునాదులను కాపాడే సిలెండర్లు దెబ్బతినడంతో ఇంజనీర్ అధికారులలో ఆందోళన మొదలైంది. అండర్ వాటర్ వీడియో గ్రఫి డైయింగ్ టీమ్‌లో సుమారు 8 మంది డైయింగ్ టీమ్ ఉండగా మరో 8 మంది హెల్పర్ల సహాయంతో సుమారు 13 రోజుల పాటు అండర్ వాటర్ వీడియోగ్రఫీ సర్వే నిర్వహించారు. ముఖ్యంగా ప్లంజ్‌పూల్(గొయ్యి) లోతు, విస్తీర్ణం ఎంత మేర ఏర్పడిందనే దానిపై ప్రధా నంగా వీడియో గ్రఫీ తీసినట్లు డైయింగ్ టీమ్ సభ్యులు మౌకికంగా తెలిపారు. అయితే సర్వే ముగించుకుని విడియో గ్రఫి టీమ్ బృందం విశాఖపట్నం వెళ్లింది. అక్కడికి వెళ్లిన తరువాత ప్లంజ్ పుల్ పై అండర్‌వాటర్ వీడియోగ్రఫీలో తీసిన వాటిని పరిశీ లించి సుమారు మూడు వారాలలో జల వనరుల శాఖ అధికారులకు సమగ్ర నివేదికనుఅందించనున్నట్లుతెలుస్తోంది. అయితే ప్లంజ్‌ఫుల్‌లోతు,విస్తీర్ణం పెరిగిందా..? ప్లంజ్ పూల్ లోపల పరిస్థితి ఎలా ఉంది..?అనే దానిపై అండర్ వాటర్ వీడియోగ్రఫీ నివేది క వస్తేగానీ చెప్పలేమని డ్యామ్ భద్రంగా ఉందా లేదా అనే విషయంపై అధికారులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# పూర్తిగా నీటిలో మునగనున్న సంగమేశ్వర ఆలయం

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం జలాశయంనకు ఎగువ ప్రాంతాల నుంచి అధిక నీరు వచ్చి చేరుతుండటంతో సప్తనదుల సంగమేశ్వర క్షేత్రం గత వారం రోజుల క్రితం నీటిలో మునిగింది. ప్రస్తుతం జలాశయంలో 863 అడుగుల నీరు ఉండటంతో సంగమేశ్వర ఆలయం పూర్తిగా నీటిలో మునిగి ఆలయ శిఖరాగ్రం అడుగు మేరకు కనువిందు చేస్తుంది. మరో రెండు అడుగుల మేర నీరు జలాశయంకు వచ్చి చేరితో ఆలయం పూర్తిగా కృష్ణానదిలోనే మునిగిపోనుంది. ప్రతీ ఏడాది ఈ ఆలయం నీటిలో మునగడం, నీరు తగ్గిన తరువాత పూజలు జరగడం విశేషం. ఈ ఏడాది 3 నెలలు మాత్రమే పూజలు అందుకుంది. 22 ఏళ్ళ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి శ్రీశైల జలాశయానికి త్వరగా నీరు వచ్చి చేరడంతో జూన్ నెలలోనే జలాశయానికి అధిక నీరు వచ్చి చేరింది. క్షేత్రం బయట పడాలంటే మరో 8 నెలల పాటు వేచి ఉండాల్సిందే. జలాశయంలో నీరు తగ్గిన తరువాతనే ఆలయం బయటపడి పూజలు జరిగే అవకాశం ఉంది.



నీటిలో అడుగు మేర కనువిందు చేస్తున్న శిఖర భాగం

# చిరుత పులుల సంచారంతో భయం..భయం..!

(మొదటి పేజి తరువాయి)



చిరుత పులులు ఆహారం కోసం కుక్కలను ఎత్తుకెళ్లేందుకు శివారు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. తరచుగా చిరుత పులులు సంచరిస్తున్నాయనీ స్థానిక ప్రజలు తెలిపారు. నల్లమల అడవి ప్రాంతం కావడంతో ఈ మధ్యకాలంలో పెద్ద పులులు,చిరుత పులుల సంఖ్య గణనీయంగా పెరిగిం ది. గత కొద్దిరోజులు క్రితమే ప్రభుత్వ వైద్యశాలలో రాత్రి 8.30 గంటలకు వైద్యశాల ఆవరణంలోనికి ఓచిరుతపులి ప్రవేశించి కుక్కను ఎత్తుకెళ్ళిన ఘటన చోటుచేసుకుంది. అది చూసిన వైద్య సిబ్బంది హడలెత్తి పోయారు. అలాగే చేపల మార్కెట్ సమీపంలో బుధవారం రాత్రి ఒంటిగంట సమయంలో చిరుతపులి సంచారంకలకలం రేపింది. ఓ ఇంటి ఆవరణం లోకి ప్రవేశించింది. కుక్కనునోట పట్టుకొని తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఇంటి యజమాని గట్టిగా అరవడంతో వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిపారు. గతంలో కూడా పలుమార్లు ఇళ్లల్లో కుక్కలను ఎత్తుకెళ్లిన ఘటనలు చోటు చేసుకున్నాయి. శ్రీశైలం – హైదరాబాద్ ప్రధాన రహదారి డ్యాం రహదారిలో ప్రతినిత్యం చిరుత పులి సంచారంతో అటు యాత్రికులు ఇటు డ్యాం వద్ద విధులు నిర్వహించే సిబ్బంది లింగాలగట్టు మత్స్యకారులు భయాందోళనలతో రాకపోకలు సాగిస్తున్నారు. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తిచేశారు. **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..అటవీ శాఖ :** శ్రీశైలం,సున్నిపెంట, లింగాలగట్టు ప్రాంతాల్లో ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ శ్రీశైలం రేంజర్ సుభాశ్ హెచ్చరించారు. సున్ని పెంటలో చిరుత పులి ఓ ఇంట్లోకి ప్రవేశించిన ఘటనను ఎఫ్ఎస్ఓ మదన్ కుమార్ నేతృ త్వంలో సిబ్బంది పరిశీలించారు. శివారు ప్రాంతాల వారు జాగ్రత్తగా ఉండాలని, చిరుత సంచారం ఉంటే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని సూచించారు. స్థానిక ప్రాంతాల్లో తమ సిబ్బందితో నిరంతర గస్తీ కొనసాగుతోందని తెలిపారు.

## ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలో కర్నూలు, నంద్యాల జిల్లాకు చోటు..!

**కర్నూలు, మేజర్ న్యూస్ :** జూన్ 25 26న ఒంగోలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 36వ రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన నూతన రాష్ట్ర కమిటీలో కర్నూలు, నంద్యాల జిల్లా కమిటీ నేతలకు స్థానం దక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కర్నూలు జిల్లాకు చెందిన గోరంట్ల కొండప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నంద్యాల జిల్లాకు చెందిన ఖండే శ్యాంసుందర్ లాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజులు పాటు జరిగిన ఈ మహాసభల్లో మొదటి రోజులు అతిథుల ప్రసంగాలు, జర్నలిస్టుల సమస్యలపై చర్చలు, జాతీయ స్థాయిలో జర్నలిస్టుల సమస్యల పై తీర్మానాలు, రెండో రోజు జిల్లా నేతల తో చర్చలు, రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలపై తీర్మానాలు, నూతన కమిటీ ఎన్నిక కోసం నామినేషన్ల స్వీకరణ, ఎన్నికలు జరిగాయి. కర్నూలు జిల్లా నుంచి కొండప్ప జిల్లా ఉపాధ్యక్షుడిగా నామినేషన్ దాఖలు చేయగా, నంద్యాల జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా మరోసారి ఖండే శ్యాంసుందర్ లాల్ నామినేషన్ వేశారు. సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డి సోమసుందర్ ప్రకటించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ఐజేయు జాతీయ అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్ము, ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్ ఎన్ సిన్హా, రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు సమావేశం అయ్యారు. రెండు రోజులపాటు జరిగిన మహాసభలు అద్భుతంగా జరిగాయని, కొంతమంది ఈ ఐక్యతను జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఈ ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన గోరంట్ల కొండప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖండే శ్యాంసుందర్ లాల్ ను జర్నలిస్టులు అభినందించారు. జర్నలిస్టుల సమస్యల కోసం కృషి చేయాలని సూచించారు.

# జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్‌లు పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డిఐజి కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎంపి బస్తిపాటి నాగరాజులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ రాజ్‌విహార్ నుండి కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీలో ప్లకార్డులతో పోలీసులు, విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1989నుండి జూన్ 26వ తేదీని అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం అవుతున్నాయని డ్రగ్స్ మహమ్మారిని నాశనం చేయకపోతే మానవాళి మొత్తం నాశనమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ రహిత సమాజాన్ని రూపొందిం చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రధానంగా విద్యార్థులు, యువత డ్రగ్స్ వాడకుండ తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత ఆనందం, ఒత్తిడి వల్ల డ్రగ్స్ వాడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కల్చరల్ యాక్టివిటీస్‌లో కానీ, క్రీడల్లాంటి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తే దురలవాట్లకు లోనుకాకుండ ఉంటారని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే మాదక ద్రవ్యాలను నియంత్రించడంలో ప్రజల్లో అవగాహన తీసుకురావడం, మాదక ద్రవ్యాలు సేవించే వారికి రిహాబిలిటేషన్ చికిత్స అందించడం వంటి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను గురించి తెలుసుకుని మంచి మార్గంలో నడిచి జీవితంలో స్థిరపడాలని ఆయన సూచించారు. డిఐజి కోయ ప్రవీణ్ మాట్లాడుతూ బంగారు భవిష్యత్తు కలిగిన యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నిర్వీర్యం చేసుకుంటున్నారని తెలిపారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండడం వల్ల ఒత్తిడిలాంటి పరిస్థితులు ఉండేవి కాదని, ప్రస్తుతం చిన్న కుటుంబాల వల్ల, తల్లి దండ్రులు ఉద్యోగాలకు వెళ్లడం వల్ల ఒంటరితనంతో మానవ సంబంధాలు దెబ్బతిని చెడు అలవాట్లకు గురవుతున్నారన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యసనాన్ని మొగ్గలోనే తుంచి వేయాలని సూచించారు. యువత, కాలేజీ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా కళాశాల, పాఠశాలల్లో యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెం : 1972కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. మేయర్ బివై రామయ్య మాట్లాడుతూ పట్టణాల్లో ఉన్న మాదక ద్రవ్యాల వినియోగం, కల్చర్ ఇప్పుడు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు పాకుతూ ఉండడమే కాకుండ రకరకాల వ్యసనాలకు యువత గురవుతుందన్నారు. అవసరం మేరకే పిల్లలకు డబ్బులు ఇవ్వాలని సూచించారు. అధిక ధనం పిల్లలకు అందుబాటులో ఉంచరాదన్నారు. ఈ మద్య కోట్లు విలువైన మాదక ద్రవ్యాలను కడుపులో ఉంచి రవాణా చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి వరకు పాకిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల యువత జీవితం నాశనం అవుతుందన్నారు. కేవలం ఒక్కరి జీవితమే నాశనం కాకుండ వారి కుటుంబం అంతా చిన్నాభిన్నం అవుతుందన్నారు. గతంలో డ్రగ్స్ కేవలం పెద్దపెద్ద నగరాల్లో మాత్రమే ఉండేవని ఇప్పుడు జిల్లాలకు వ్యాప్తి చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. సమావేశానుద్దేశించి కేర్ కమిటీ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, స్ఫూర్తి రిహాబిలిటేషన్ శివ శంకర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ చైతన్య కుమార్‌లు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం గోడపత్రికలను విడుదల చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమీషనర శ్రీదేవి, అసిస్టెంట్ కమీషనర్ హనుమంతరావు, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఐసిడిఎస్ పిడి నిర్మల, మెప్మా పిడి నాగ శివలీల, డిఎంఅండ్‌హెచ్ఓ శాంతికళ, డిఈఓ శామ్యూల్ పాల్, ఎస్ఐలు, సిఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, డిఐజి, ఎస్పీ అధికారులు

భూసేకరణ క్లెయిమ్‌ల పరిష్కారం పట్ల

# శ్రద్ధ చూపండి


**– ఆర్డీవో విశ్వనాథ్**



మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** జమ్ములమడుగు – నంద్యాల జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 167కె) నిర్మాణ పనుల్లో భాగంగా భూసేకరణ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆర్డీవో విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సువర్ణదేవితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతుల ఖాతాల్లో వారికి అందాల్సిన మొత్తాన్ని వారికి అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే నీటి తీరువా బకాయిల వసూళ్లను వీఆర్‌వోలు వేగవంతం చేయాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా



రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా ఎన్నికైన మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరించిందని, రైతులు సాగుచేసుకున్న పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక, పండించిన పంటలకు చేతికి అందకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్న రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి వైయస్ఆర్‌సిపి తరపున ఉద్యమిస్తానని వైయస్ఆర్‌సిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వైయస్ఆర్‌సిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాకు చెందిన మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డిని వైయస్ఆర్‌సిపి రాష్ట్ర రైతుఅనుబంధ విభాగ కమిటీ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అనంతరం మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను వైయస్ఆర్‌సిపి రాష్ట్ర రైతు విభాగ అనుబంధ కమిటీ కార్యదర్శిగా ఎన్నుకున్న మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, వైయస్ఆర్‌సిపి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు ఎంవిఎస్.నాగిరెడ్డి, డోన్ నియోజకవర్గం వైయస్ఆర్‌సిపి యువనేత బుగ్గన అర్జున్‌అమర్‌నాథ్‌రెడ్డిలకు మరియు డోన్ నియోజకవర్గం డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల వైకాపా నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటి పైకప్పు శుభ్రంగా ఉంచుకోవాలి

**– మున్సిపల్ భవనాలపై వర్షపునీరు నిలవకుండ స్పెషల్ డ్రైవ్ – కమీషనర్**



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగర ప్రజలు తమ ఇళ్లు, భవనాల పైకప్పులను శుభ్రంగా ఉంచుకోవాలని, పైకప్పుల్లో వర్షపునీరు నిలవకుండ సజావుగా కిందికి సాగేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్ర బాబు సూచించారు. గురువారం ఆయన సచివాలయ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పైకప్పుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ఆ నీరు లోపలికి వెళ్లి ఐరన్ పొద్దె పెచ్చులు ఊడుతాయని, స్లాబ్ పటిష్టత దెబ్బ తింటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని మున్సిపల్, సచివాలయ, పాఠశాల, కమ్యూనిటీ భవనాలపై శుభ్రం చేసేందుకు వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమీషనర్ వెల్లడించారు. సంబంధిత సిబ్బంది పైకప్పులను శుభ్రం చేసి నీరు సజావుగా ఆటంకం లేకుండా సాగేందుకు చర్యలు తీసుకోవాలని కమీషనర్ ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో వర్షపునీరు వేగంగా బయటకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే నగర పరిధిలోని ప్రధాన డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు దాదాపు పూర్తి అయ్యాయని మిగిలిన కొన్ని ప్రాంతాల్లో వారంలోగా పూర్తి చేస్తామన్నారు.

# పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



ప్రాణేష్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్‌పాల్ అన్నారు. మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బి ప్రాణేష్ కుమార్ గత నెల 31వ తేదీన పదవీ విరమణ పొందడంతో గురువారం పదవీ విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా డిఈఓతో పాటు పలువురు జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవి కాలం పూర్తవడంతో పదవీ విరమణ జరిగిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందని అనుభవం కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలో పనిచేస్తున్నారని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరి ఉత్తమ ఫలితాలు సాధించాలని వారు పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు ప్రాణేష్ కుమార్ దంపతులను పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భాష్యం విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి

**– పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్**




ధర్నా చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** భాష్యం విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డాక్టర్స్ కాలనీ నందు భాష్యం పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ కుమార్ మాట్లాడుతూ అడ్మిషన్స్ కొరకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తూ ఫీజుల దోపిడీ చేస్తున్న భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ధనార్జనే ధ్యేయంగా ఫీజుల దోపిడి చేస్తున్న భాష్యం పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే అంగట్లో సరుకుల్లాగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టై అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ఫీజులు విచ్చలవిడిగా వసూలు చేస్తున్నారని తక్షణమే విద్యాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు దామోదర, అస్లాం బాష, విష్ణు, రఘు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి బస్టాండ్‌కు కుర్చీలు మంజూరు



కుర్చీలను ఏర్పాటు చేసిన దృశ్యం

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** కర్నూలు బస్‌స్టేషన్‌కు కేంద్ర కార్యాలయం నుండి 25కుర్చీలు మంజూరైనట్లు కర్నూలు ఇంచార్జ్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె సుధారాణి తెలిపారు. గురువారం బస్టాండ్ ఆవరణలో కుర్చీలను కర్నూలుకు చెందిన వ్యాపారవేత్త సుబ్బారావు చేతుల మీదుగా బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం కర్నూలు జిల్లా బస్టాండ్‌లో ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు–2డిపో మేనేజర్ శర్మ, కర్నూలు–1డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్రమణ్యం, బస్టాండ్ మేనేజర్ కాంచన, సిబ్బంది పాల్గొన్నారు.

# దోమలపెంట వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా







**శ్రీశైలం,మేజర్ న్యూస్ :** శ్రీశైలం– హైదరాబాద్ ప్రధాన రహదారి దోమలపెంట వద్ద గురువారం ఉదయం ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి మల్లన్న దర్శనం కోసం బయలుదేరిన బస్సుకు దోమలపెంట చెక్‌పోస్ట్ వద్దకు రాగానే బ్రేకులు ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.బస్సుకు బ్రేకుల్ ఫెయిల్ అయి ముందుగా వెళుతున్న కారును ఢీకొనింది. వెంటనే రోడ్డుపై వెళ్తున్న ఆవును కూడా ఢీ కొట్టింది.ఈ ఘటనలో పలువురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.వెంటనే వారిని స్థానికంగా ఉన్న జెన్కో వైద్యశాలకు తరలించి చికిత్సలు అందజేశారు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# మూడు ఏసీలు విరాళం



ఏసీలను అందచేసిన దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు మెడికవర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మూడు ఏసీలను విరాళంగా అందచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి వ్యక్తికి ఉపయోగపడే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి ఏసిలను విరాళంగా ఇచ్చిన మెడికవర్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శివబాల నాగాంజన్, మెడికవర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళితుల స్మశాన వాటికలను అభివృద్ధి చేయండి



వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండలంలో దళితుల స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని సీనియర్ ఎమ్మార్పీస్ నాయకులు గుండమ్మయ్య మాదిగ, మండల ఉపాధ్యక్షులు బండమీది నారాయణ మాదిగలు గురువారం మండల అభివృద్ధి అధికారిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని దళితుల స్మశాన వాటికలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రహరీ గోడలు, నీటి వసతి, అవసరమైన చోట పూడిక పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మీదివేముల గ్రామంలోని ఎస్సీల స్మశాన వాటిక చాలా ఇబ్బందికర పరిస్థితిలో ఉందని వెంటనే అక్కడ మట్టిని తోలించి స్మశాన వాటికను శుభ్రం చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ఇందుకు స్పందించిన మండల అధికారి స్మశాన వాటిక అభివృద్ధికి తప్పకుండ సహకరిస్తామని తెలిపారు.

# అన్ని అవయవాలలో కళ్లు ఎంతో కీలకమైనవి

**– తన పుట్టినరోజు సందర్భంగా కంటి అద్దాలు పంపిణీ చేసిన డా.శంకర్ శర్మ**



కంటి అద్దాలు అందచేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ :** మనిషికున్న అన్ని అవయవాలలో కళ్లు ఎంతో ముఖ్యమైనవని, వాటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. గురువారం నగరంలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న మీడియా పాయింట్ వద్ద తన పుట్టినరోజు సందర్భంగా ఆయన ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. శంకర్ శర్మ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్న సూక్తిని ఆయన గుర్తు చేస్తూ మనిషి శరీరంలో కంటి యొక్క ప్రాధాన్యతను వివరించారు. మీ కృత్రిమ మేధస్సు అభివృద్ధి చెందిన తరువాత మనిషి మెదడులోని కంటికి సంబంధించిన ప్రాంతంలో ఒక చిప్ అమరిస్తే భవిష్యత్తులో కంటి చూపులేని వారు కూడా ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దిశగా దేవుడి ఆశీస్సులు, శాస్త్రవేత్తల కృషి జరగాలని కోరుకున్నారు. ప్రతిఒక్కరు తమ సంపదలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. అలాగే ప్రతిఒక్కరు చెట్లు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు.

సూర్య

శుక్రవారం | 27 జూన్ 2025

# లక్ష్యాలు సాధించిన బ్యాంకర్లకు కలెక్టర్ అభినందన

- ఈ ఏడాది మరింత ఎక్కువ రుణాలిచ్చి నమ్మకాన్ని పెంచాలి
- కౌలు రైతులకు రుణాలు మంజూరులో మరింత చొరవ చూపాలి
- కలెక్టర్ పి.రంజిత్ బాషా



రుణ ప్రణాళిక లక్ష్యం పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** గత ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరులో లక్ష్యాలు బాగా సాధించారని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా బ్యాంకర్లను అభినందించారు. అలాగే ఈ ఏడాది కూడా మరింత ఎక్కువగా రుణాలు చేసి బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్లకు సంబంధించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని రంగాల్లో బ్యాంకర్లు కేటాయించిన లక్ష్యాలు సాధించారని అయితే ఎమ్ఎస్ఎంఈ, హౌసింగ్, విద స్టాండ్ ఆఫ్ ఇండియా లోన్లు ఇవ్వడంలో మాత్రం బ్యాంక్‌లు వెనుకబడి ఉన్నాయని, ఈ ఏడాది ఈ రంగాలకు కూడా విరివిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. విజన్ ప్లాన్‌లో భాగంగా రానున్న కాలంలో జిల్లా పునరుత్పాదక శక్తి(రెన్యువబుల్ ఎనర్జీ) కేంద్రంగా మారనుందన్నారు. ఓర్వకల్లులో 1000మెగా వాట్స్‌కి సంబంధించిన సోలార్ ప్రాజెక్టుతో పాటు గ్రీన్‌కో ద్వారా 1680మెగా వాట్ల సామర్థ్యంతో పంప్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారన్నారు. వీటితో పాటు ఆలూరు, ఆస్పరి, పత్తికొండ ప్రాంతాల్లో పలు సోలార్, విండ్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయన్నారు. అందువల్ల ఈ రంగంలో రుణాల మంజూరుపై శ్రద్ధ వహించాలన్నారు. అలాగే జిల్లాలో పిఎం సూర్యఘర్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్టాండ్ ఆఫ్ ఇండియా, పిఎం విశ్వకర్మ యోజన రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. అలాగే సిసిఆర్‌సి కార్డుదారులకు రుణాలు ఇవ్వడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్బీసి గైడ్లెన్స్ ప్రకారం డ్రోన్ల మంజూరుకు సంబంధించి కూడా రుణాల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఫిషరీస్‌కు సంబంధించి ఏపిజిబి బ్యాంకులో ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అత్యవసరంలో ఉన్న పేదల కోసం జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకులు కలిసి కొంత మొత్తంతో సిఎస్ఆర్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం 2025-26వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.17,402.86కోట్ల ప్రణాళిక పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. తదనంతరం ఎల్‌డిఎమ్ రామచంద్రరావు జిల్లాలో గత ఏడాది బ్యాంకర్లు సాధించిన లక్ష్యాలను గురించి వివరించారు. ఈ సమావేశంలో కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, మెప్మా పిడి నాగ శివలీల, ఎస్‌సి, ఎస్‌టి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు



ఏడీఏకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏవో ప్రసాదరావు, సిబ్బంది

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల ఏడీఏగా ఆంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆత్మకూరు ఏడీఏగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మధ్యకాలం జరిగిన జనరల్ బదిలీలలో నంద్యాల ఏడీఏగా బదిలీ అయ్యారు. ఇక్కడ ఉన్న రాజశేఖర్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఏడీఏ ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు అమలుకు కృషి చేస్తానని అన్నారు. రైతులకు సాంకేతిక సహాయం అందిస్తూ వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు కృషి చేస్తానని అన్నారు. రైతులు మెరుగైన సాగు పద్ధతులు పాటించడానికి, అధిక దిగుబడులు సాధించడానికి సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తానని అన్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను రైతులకు సరఫరా అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా నూతన ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులుకు మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది, ఆయా మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# పొద్దుపోని కార్యక్రమాలు చేస్తున్న వైసిపి

- ప్రజలకు ఏ మేలు చేశారో చెప్పండి జగన్
- టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పొద్దుపోని కార్యక్రమాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి వైసిపి నాయకులకు హితవు పలికారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అధికారంలో ఉన్నన్ని రోజులు అన్ని వర్గాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసి రాష్ట్రాన్ని సమూలంగా దోచేశారన్నారు. అందుకే వాళ్లకు ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ఇంటికి పరిమితం చేశారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయారని, ఏమీ తోచక తన కాలక్షేపం కోసం తనను ప్రజలు మర్చిపోతారేమోనన్న భయంతో చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికే 80శాతం అమలు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే మిగిలినవి కూడా ఆచరణలోకి రానున్నాయన్నారు. వైసిపి హయాంలో ప్రజలకు ఏ మేలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. జగన్ మాదిరి సిఎం చంద్రబాబునాయుడు ప్రజల నుండి తప్పించుకుని పరదాల చాటున తిరిగే వ్యక్తి కాదని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నాక్యాంటీన్లు పునఃప్రారంభం, డిఎస్‌సి పోస్టుల ప్రక్రియ ప్రారంభం, తల్లికి వందనం కింద రూ.13వేలు ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి జమ చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి అందించడం జరుగుతుందని తెలిపారు. ఆనాడు నారా లోకేష్ రెడ్‌బుక్ గురించి అవహేళన చేసిన మీరు ఇప్పుడు రెడ్‌బుక్ అంటే ఎందుకంత వణుకుతున్నారని నిలదీశారు. తెదేపా అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పని చేసిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయకుండ కాస్త ఆలోచించి మాట్లాడాలని సూచించారు.

# డ్రగ్స్‌ను తరిమికొడదాం..

– టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** డ్రగ్స్‌ను తరమికొడదామని, దీని వల్ల యువత పాడైపోతారని టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మంత్రాలయం మండల కేంద్రంలో గురువారం సిఐ రామాంజులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, నాయకులు యువత కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇంచార్జీ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు వాడడం వల్ల యువత చెడు అలవాట్లకు గురై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, ఈ డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఎస్.ఐ శివాంజులు, మాధవరం ఎస్.ఐ విజయ్ కుమార్, డిటి జనార్ధన్ రావు, ఈఓ ఉపేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు ఆశోక్‌రెడ్డి,వరదరాజులు, చైర్మన్ నరసింహులు, నరసింహాచారి, మేకల నరసింహులు, చట్నేపల్లి నాగేష్, సూగూరు ఇస్రాయిల్, రాజన్న, శివ దేవిడ్, రాఘవేంద్ర, పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవకు రెవెన్యూ చిక్కులు

- ◆ బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపిన రెవెన్యూ అధికారులు
- ◆ ఇప్పటికీ ఈ కేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతుల జాబితా..



బ్రతికి ఉన్న మనిషిని చనిపోయినట్లు చూపుతున్న వ్యక్తి (ఫైల్‌ఫోటో)

**మిడుతూరు మేజర్ న్యూస్ :** అన్నదాత సుఖీభవ పథకమునకు రైతులకు ఈకేవైసి ప్రక్రియ పెండింగ్లో ఉన్నట్లు వారికి నగదు బదిలీలేనట్లే. వైకాపా ప్రభుత్వంలో జరిగిన రి సర్వేలో అనేక తప్పులు జరిగాయి. సర్వే జరిగిన గ్రామాలలో జాయింట్ ఎల్ పి నెంబర్లు ఉండ దంతో వారికి ఈకేవైసి చేసుకోవడానికి ఇబ్బందికర రంగా మారింది. అలా చూపుతున్న సర్వే నంబర్ల రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించే విషయంలో సాంకేతిక చిక్కులు ఏర్పడే అవకాశం ఉంది. రైతులు స్టేటస్ తెలుసుకోవచ్చు ఇటువంటి చిక్కులు ఉండడం వల్లనే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ఆలస్యం అవుతుంది అని సమాచారం. ఏకంగామిడుతూరు గ్రామంలో ఒక రైతు బతికి ఉన్న చనిపోయినట్లు రెవెన్యూ అధికారులు తొలగించడంతో అతను అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేశారు రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం వల్లే అతను చనిపోయినట్లు రికార్డుల్లో చూపిస్తున్నాయి. దీనిని తొలగించమని రెవెన్యూ మరియు అగ్రికల్చర్ ఆఫీస్ చుట్టూ అతను ప్రదక్షణలు చేస్తున్నాడు .అన్నదాత సుఖీ భవ పథకం సాయం పొందడానికి రైతు లంతా ఈకేవైసీ వేలిముద్ర పూర్తి చేయా లని వ్యవసాయ అధికారులు చెప్పడంతో రైతులు సేవా కేంద్రాల వద్ద క్యూ కట్టారు అయితే ప్రభుత్వం రైతులకు తీపి కబురె చెప్పింది కీలక నిర్ణయం తీసుకుంది అందరూ రైతులు ఈ కే వై సీ చేయించు కోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం వద్ద వివరాలు లేని రైతులు మాత్రమే చేయించు కోవాలని తెలిపింది జాయింట్ ఎల్పీ నెంబర్లు ఉన్న రైతులకు అన్నదాత సుఖీభవ లభిస్తుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు దీనిపై ప్రభు త్వము సుమోటోగా ఎల్పీ నెంబర్లను తొలగించ మని ఆర్డర్లు జారీ చేసిన సర్వేయర్లుదీనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పూర్తిగా కొలతలు వేసిన తర్వాతనే జాయింట్ తెలిపి నంబర్లను తొలగిస్తానని అధికారులు చెప్పడం దీనిపై ఉన్నతాధికారులు స్పందించి జాయింట్ ఎల్పినెంబర్ ల నుతొలగించాలని రైతులు కోరుతున్నారు రీ సర్వే జరిగిన గ్రామాలలో జాయింట్ ఎల్పీ నెంబర్స్ ఉండడంతో తల్లికి వందనం కూడా నష్టపోయామని ఇప్పుడు అన్నదాత సుఖీభవ పథకానికి కూడా వర్తిస్తుందా లేదా అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు దీనిపై అధికారులు సత్వరమే పరిష్కారం చూపించాలని రైతన్నలు కోరుతున్నారు.

# విట్ యూనివర్సిటీకి ఎంపికైన వెల్దుర్తి విద్యార్థి



విద్యార్థి షేక్ అబ్దుల్ ఫయాజ్

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ :** వెల్దుర్తి పట్టణంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాలకు చెందిన షేక్ అబ్దుల్ ఫయాజ్ ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో 965 -1000 మార్కులు సాధించి కర్నూలు జిల్లాలో ప్రథమ స్థానం సాధించడంతో అమరా వతి స్టార్స్ ప్రోగ్రాం ద్వారా విట్ ప్రైవేట్ యూ నివ ర్సిటీకి ఎంపికైనట్లు యాజమాన్యం ఫోన్ ద్వారా విద్యార్థి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజే శారని తండ్రి ఆటో వలి పేర్కొన్నారు. విట్ యూ నివర్సిటీ అమరా వతి నందు ఉచితంగా బీటెక్ కోర్సు చదువుకోవడానికి సీటు మంజూరు చేశామని తల్లిదండ్రులకు తెలిపారు. ఈ సంద ర్భంగా విద్యార్థి షేక్ అబ్దుల్‌ఫయాజ్ మాట్లాడుతూ వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మంచిగా విద్యాబోధన నేర్పించడం వలనే నాకు ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించానన్నారు. కావున వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి విద్యార్థి షేక్ అబ్దుల్‌ఫయాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమ్మ ఒడి వద్దు, తల్లికి వందనం ముద్దు

– టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు పాలాభిషేకం

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** అమ్మ ఒడి వద్దు తల్లికి వందనం ముద్దు అని టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు చక్రాల ముని నాయుడు, ఉపాధ్యక్షులు బి.టి. పవన్‌లు పేర్కొన్నారు. బుధవారం టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నాలుగు స్తంభాల వద్ద సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్, ఎమ్మెల్యే కె.ఈ శ్యామ్ కుమార్ చిత్రపటాలకు విద్యార్థులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ ఎన్నికల హామీలోభాగంగా, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థి తల్లికి వందనం రూ. 15వేలు తల్లి ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రూ. 10వేల కోట్లు 64లక్షల మందికి విద్యార్థులకు ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు కృతజ్ఞతగా విద్యార్థులు పాలాభిషేకం చేశారన్నారు. వినయ్, శరత్, రవీంద్ర, రామాంజి, సోము, తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాత సుఖీభవ ఈనెలలోనే రైతుల ఖాతాల్లో జమ




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

– తారతమ్యాలు, విభేదాలు పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలి
– మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నందికోట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. సమావేశంలో జూపాడుబంగ్లా మండల టీడీపీ అబ్జర్వర్, వెంకటాపురం సర్పంచ్ రాజారెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి టీడీపీ బలోపేతానికి కృషి చేయడం వల్లే మనం అధికారంలోకి వచ్చామని, ఇంకా క్లస్టర్ ఇన్‌చార్జీలు, బూతు కమిటీలు, కేఎస్ఎస్ కమిటీలు అందరూ ఇంటింటికి తిరిగి పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలని అన్నారు. అనంతరం నందికోట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలో జరిగాయయని, ఆ నాడు కూడా 2014- 2019లో కూడా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి చెప్పుకోలేక ఓడిపోయామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి ఒక వైపు, సంక్షేమం రెండింటిని సమానంగా చూస్తూ ముందుకు వెళ్తున్నారని, తల్లికి వందనం కుటుంబంలో ఒక్కరికి వేయడానికే ఆ ప్రభుత్వం లబ్ధిదారులను చాలా ఇబ్బందులకు గురి చేసిందని, ఈనాడు కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు తల్లుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, అలాగే జూన్ నెలలోనే అన్నదాత సుఖీభవ అమలు చేసి రైతుల ఖాతాలో జమ చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. అలాగే విస్తృత సమావేశంలో పార్టీ విది విధానాల గురించి కార్యకర్తలకు, నాయకులకు వివరించారు. గ్రామాల్లో నాయకులు పటిష్టంగా ఉంటేనే పార్టీ పునాదులు పటిష్టంగా, గట్టిగా ఉంటాయని, ఆ దిశగా అందరూ ముందుకు వెళ్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి గిరీశ్వర్‌రెడ్డి, డీసీసీ కమిటీ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్ బాలయ్య, శ్రీనివాసులు నాయుడు, రమణారెడ్డి, నారాయణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జంగాల పెద్దన్న, సుధాకర్, రామ్మోహన్‌రెడ్డి, రవికాంత్, రవి యాదవ్, దేవసాయం, కృష్ణారెడ్డి, రసూల్, దొరబాబురెడ్డి, లక్ష్మణ గౌడ్, హుసేనయ్య, శివచిన్నయ్య, అడ్డాకుల ప్రసాద్, శ్రీకాంత్, షాలు, పగిడాల మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, పగిడాల, పాముల పాడు అబ్జర్వర్స్ వేణు, షాపుద్దీన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ వారి ఆధ్వర్యంలో వివిధ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యువత దేశ సంపద అని మాదక ద్రవ్య రహిత సమాజం నిర్మిద్దామంటూ విద్యార్థినీ విద్యార్థులు ప్లకార్డ్స్ ప్రదర్శించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో భాగంగా బనగానపల్లె ప్రొహిబిషన్ ఎక్సైజ్ సి.ఐ సతీష్, ఎస్.ఐ కమలాకర్, పోలీసు శాఖ సి.ఐ మంజునాథ రెడ్డి, ఎస్.ఐ దుగ్గిరెడ్డి మరియు ఎస్వీ డిగ్రీ కళాశాల కె.జి.ఆర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఈ ర్యాలీలో ఆర్టీసీ బస్టాండు మీదుగా పెట్రోల్‌బంక్, అగ్నిమాపక కార్యాలయంలో , ప్రభుత్వ కళాశాల మైదానం నందు దాదాపుగా 800మంది విద్యార్థినీ విద్యార్థులచేత ఎక్సైజ్ శాఖా సిబ్బంది వారు ప్రతిజ్ఞ చేయించారు. ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చుకుందామన్నారు.

# డ్వాక్రా సంఘాల సేవలు ట్యాబ్‌లతో మరింత వేగవంతం

– డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి



ట్యాబ్‌లు అందుకున్న ఆర్‌పిలతో ఎమ్మెల్యే కోట్ల, అధికారులు

**డోన్, మేజర్‌న్యూస్ :** డ్వాక్రా సంఘాల సేవలను పొదుపు సంఘాల మహిళలకు మరింత వేగంగా అందించేందుకు ట్యాబ్ లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం డోన్ మున్సిపల్ పరిధిలోని మెప్మా డ్వాక్రా సంఘాల రిసోర్స్‌పర్సన్స్‌కు సామ్‌సంగ్ గెలాక్సి ఏ9 ప్లస్ ట్యాబ్‌లను ఎమ్మెల్యే కోట్ల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ డోన్ మున్సిపల్ పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు సేవలు వేగంగా అందించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని తెచ్చిందన్నారు. మున్సిపాలిటీల వారిగా మహిళా సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు సమాఖ్య రిసోర్స్‌పర్సన్లకు ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌గౌడ్, మెప్మా అధికారులు, ఎస్‌హెచ్‌జి రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక భావం ఉండేలా గణేష్ మండపాలు ఉండాలి




గణేష్ ఉత్సవ సమావేశంలో పాల్గొన్న ఎంపీ బైరెడ్డి శబరి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లాలో ప్రతి సంవత్సరం లాగే వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిభావం పెరిగేలా జరుపుకుందామని ప్రతి గణేష్ మండపం వద్ద ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా ఉత్సవాలు జరుపుకుని ఎలాంటి సంఘటనలు జరగకుండా గణపతి విగ్రహాలు నిమజ్జనం జరిగేలా నిర్వాహకులు సహకరించాలని నంద్యాల జిల్లా గణేష్ ఉత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షులు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని టెక్కె భరతమాత మందిరం రోడ్డులోని విహెచ్‌పి కార్యాలయంలో గణేష్ ఉత్సవ కేంద్ర సమితి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, దక్షిణ భారత విహెచ్‌పి ఉపాధ్యక్షులు యర్రం పురుషోత్తం రెడ్డి, దక్షిణ భారత శ్రీసరస్వతీ విద్యామందిరం ఉపాధ్యక్షులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు చంద్రమౌళీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్ వదులుకో... జీవితాన్ని మలుచుకో

– ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం – ఎక్సైజ్ సిఐ, పోలీసు సిఐ, తహశీల్దార్‌లు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నేటి ఆధునికి ప్రపంచంలో సాంకేతికత కొంత పుంతలు తొక్కుతుంటే పాశ్చాత సాంప్రదాయాలైన మాదక ద్రవ్యాల వాడకాన్ని యువత అందిపుచ్చుకొని వాటిని ఫ్యాషన్‌గా మార్చుకొని బంగారు లాంటి భవిషత్‌ను డ్రగ్స్ మత్తులో నలిపేస్తున్నారని, యువత మేలుకొని డ్రగ్స్‌ను వదిలి తమ జీవితాలను మలచుకోవాలని తహశీల్దార్ రత్నరాధిక, సిఐ రాము, ఎక్సైజ్ సిఐ మోహన్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్నలు అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదిత్య, థెరిస్సా కళాశాలల విద్యార్థులతో ప్లేకార్డులు ప్రదర్శిస్తు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి గౌడ్ సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు సాగి తిరిగి గౌడు సెంటర్ చేరుకొని మానవ హారంగా ఏర్పడి మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఆరోగ్యానికి ఎంతో హానికరమని తెలిసినా వాటికి బానిసలై బంగారు లాంటి భవిషత్‌ను నాశనం చేసుకొని ఎందరో తనువు చాలిస్తు కుటుంబ సభ్యులను ఆనాథలుగా చేస్తున్నారని అన్నారు. ప్రధానంగా నేటి ఆధునిక సమాజంలో యువత డ్రగ్స్‌వైపు మొగ్గుచూపుతూ తమ లక్ష్యాన్ని మరిచిపోతూ కన్నవారికి కన్నీళ్ళు మిగిలిస్తున్నారని అన్నారు. డ్రగ్స్ వాడకం అంటే ఓ ఫ్యాషన్ అనుకొని వాటికి బానిసలై చేతులార బంగారు భవిషత్‌కు సంకెళ్లు వేస్తు బంధిలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వాడకం ఎంతో ప్రమాదకరమని వాటి కి దూరంగా ఉండి యువత మేలకొని తమ భవిషత్‌ను మలచుకోవాలని కోరారు. దేశ భవిషత్ యువత చేతిలోనే ఉందని, యువత శక్తి దేశానికి ఎంతో అవసరమన్నారు. యువత, వారి తల్లిదండ్రులు, ప్రజలు డ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండి డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరు బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్ వాడకాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని , డ్రగ్స్ సంబంధించిన ఎలాంటి సమాచారం అందినా పోలీసులకు సమాచారం అందించి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, సిబ్బంది, జూనియర్ కళాశాలల విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడికి జైలు శిక్ష



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన నింధితుడు గుడిసె రుద్రేష్‌కు 20సం॥లు జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఫోక్సో కోర్టు జడ్జి ఈ రాజేంద్ర ప్రసాద్ గురువారం తీర్పు చెప్పారు. 2020 అక్టోబరు 22న బాధిత బాలిక (4సం॥లు) వారి ఇంటి సమీపంలోని ఒక గుడి సమీపంలో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన నింధితుడు గుడిసె రుద్రేష్ ఆ బాలికను అత్యాచారం చేస్తుండగా బాధిత బాలిక కేకలు వేసింది. దీంతో బాలిక తల్లితో పాటు వీధిలోని వారు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే నింధితుడు ఆ బాలికను అత్యాచారం చేసి అక్కడి నుండి పారిపోవడం జరిగింది. వెంటనే తల్లిదండ్రులు బనగానపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నింధితుడిపై ఫోక్సో చట్టం కింది కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షలకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటి డోన్ డిఎస్పీ వి నరసింహారెడ్డి కేసును విచారించి నింధితుడిని కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నింధితుడిపై నేరం రుజువు కావడంతో నింధితుడు గుడిసె రుద్రేష్‌కు 20సం॥ల జైలు శిక్ష, రూ.50వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమాన మొత్తాన్ని బాధిత బాలికకు చెల్లించాలని న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. బాధిత బాలిక తరుపున పిపి సివి శ్రీనివాసులు వాధించారు.

# ఎల్లార్తి దర్గాలో భక్తిశ్రద్ధలతో ఫాతేహల్

**హొళగుంద,మేజర్‌న్యూస్:** హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో కొలువైన హజరత్ శేక్షావలి,హజరత్ షాషావలితాతల దర్గాలో భక్తులు గురవారం భక్తిశ్రద్ధలతో ఫాతేహల్ కార్యక్రమం నిర్వహిం చారు. భక్తులు మండలం నుండి కాకుండా కర్ణాటక,ఆంధ్రాలోని దూర ప్రాంతాల నుండి,తెలంగాణా రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో వచ్చి దార్గలో ప్రత్యేక ఫాతేహల్ నిర్వహించారు.మొక్కుబడులు తీర్చుకున్నారు.రెండు దర్గాలో భక్తుల సందడి నెలకొంది.దర్గా నిర్వహకులు దర్గాలో భక్తులకు అన్నధాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం

– జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఐదురోజుల ముందే ఇళ్ల దగ్గరకు తీసుకెళ్లి రేషన్ బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అందులో భాగంగా గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య పత్తికొండలో రేషన్ బియ్యం పంపిణీలో పాల్గొన్నారు. ముందుగా పత్తికొండ పట్టణంలోని దివ్యాంగురాలైన శాంత భాయి ఇంటికి వెళ్లి జూలైలో ఇవ్వాల్సిన రేషన్‌ను పంపిణీ చేశారు. రేషన్ సంస్కరణలో భాగంగా ప్రతి నెల 26వ తేదీ నుండి 30వ తేదీలోపు వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే రేషన్ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని జెసి తెలిపారు. కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో డీలర్ రవి ఇంటి వద్దకే వెళ్లి దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ పంపిణీ చేశారు. అలాగే నగరంలోని అన్ని షాపుల్లో జెసి ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులకు రేషన్ పంపిణీ చేశారు.

# డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం యువత నడుం బిగించాలి

**ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ పిలుపు**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణం లోని వైపిపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని సంయుక్తంగా కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు ఆలవాటు పడి జీవితాలను నాశనంచేసుకోవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయించినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ముందుకు రావాలని డీఎస్పీ ప్రమోద్ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కూడా యువతకు



ర్యాలీ లో పాల్గొన్న డి.ఎస్.పి ప్రమోద్ కుమార్, తదితరులు

మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తూ సదస్సులను నిర్వహించడం జరుగుతున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ బాబు, రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిశోర్, తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి ఎంపీడీవో నూర్జహాన్ ప్రైవేట్ పాఠశాలల తాలూకా అధ్యక్షులు అమీర్ భాష , తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజం నిర్మిద్దాం

**అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ**




విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** మాదకద్రవ్య రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, యువత మత్తు పదార్థాల జోలికి వెళ్ళరాదని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విద్యార్థులు, పుర ప్రజలు, పోలీసుల అధికారులతోకలిసిర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ చేయించారు. సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువతఅలవాటుపడి బంగారుభవిష్యత్తు అంధకారం చేసుకుంటున్నారని, అటువంటిజోలికి వెళ్లరాదన్నారు. గత ప్రభుత్వం డ్రగ్, గంజాయి, ఆంధ్రప్రదేశ్ గా చేసిన చరిత్ర ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా తీర్చి దిద్దుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయిని నిర్మూలించి కొన్నివేల ఎకరాలను కట్టడి చేసిందన్నారు. గంజాయి సాగు, రవాణా చేసే వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలుపు వేసేలాచర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులుడ్రగ్స్కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్ర బాబు, పటమస్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ శేషఫణి, ఎక్సైజ్ సీఐ, ఎస్సై, పాఠశాల విద్యార్థులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ భవనాన్ని తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి

**గడివేముల, మేజర్ న్యూస్ :**

మండల కేంద్రమైన గడివేములలోని పంచాయతీ కార్యాలయాన్ని గురువారం నాడు జిల్లా పంచాయతీ అధికారి లలితా భాయ్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో వీధిలలో శుభ్రంగా ఉంచాలన్నారు. చెత్త సేకరణ కేంద్రాలను మరియు మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలలోని చెత్తను ఎత్తివేయాలని అలాగే ప్రజలు కూడా తడి చెత్త పొడి చెత్తను వేరుగా చేసి పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని కోరారు. అలాగే ప్రతి నెల ట్యాంకును శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలన్నారు. చెత్త సేకరణ కేంద్రాల వద్ద చెత్తతో సంపాదన సృష్టించలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యాలయం అంకన్న, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


నీళ్ల ట్యాంక్ ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

# ప్రైవేటు పాఠశాలల దోపిడి


**– టి.సి ఇవ్వాలంటే రూ.500 నుండి రూ.1000 లు డిమాండ్**

**– ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు – పట్టించుకోని విద్యాశాఖ అధికారులు**

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** ప్రవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఓవైపు పుస్తకాలు, దుస్తుల పేరుతో వేలకువేలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దానికితోడు స్కూల్ మారాలనుకునే విద్యార్థులకు ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్లు ఇవ్వాలంటే రోజుల తరబడి తిరుగుతూ ఎటువంటి ఫీజు బకాయిలు లేకపోయినా రూ.500 నుండి 1000 రూపాయలు ఇస్తేనే ట్రాన్స్ఫర్ సర్టిఫికేట్ ఇస్తామని డిమాండ్ చేస్తున్నారు. కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన పెద్దరాజు కుమార్తె జోష్న బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు 10వ తరగతి పూర్తి చేసింది. అయితే ఉన్నత చదువుల కోసం టి.సి ఇవ్వాలని అడగగా రూ. 500 రూపాయలు కడితేనే ఇస్తామని స్కూల్ యాజమాన్యం తేల్చిచెప్పారు. ఎటువంటి ఫీజు బకాయి లేకపోయినా తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని చెప్పినా వారు పట్టించుకోవడం లేదని డబ్బులు ఇస్తేనే టీ.సి ఇస్తామని డిమాండ్ చేస్తున్నారని పెద్దరాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ నందు కల్చరల్ ప్రోగ్రామ్స్, నూతన సంవత్సరం ప్రోగ్రామ్స్, మ్యాజిక్ ప్రోగ్రామ్స్ పెట్టి తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారం లేకుండా ఈ కార్యక్రమాలకు డబ్బులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తన కూతురు చదువుకు విద్యాశాఖ అధికారులు , పాఠశాల యాజమాన్యం స్పందించి ట్రాన్స్ఫర్ సర్టిఫికేట్ ఇప్పించాలని వారు కోరుతున్నారు. ఇలాంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మాదకద్రవ్య నిర్మూలనకు అందరూ సహకరించాలి

**అవుకుమేజర్,న్యూస్ః** మాదక ద్రవ్య రహిత సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని అవుకు మండల టీడీపీ అద్యక్షులు ఉగ్రసేనా రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామని అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ఒక సందేశంలో కోరారు. డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



## కాలినడకన తిరుమలకు బయలుదేరిన నాగ శ్రీనివాసులు

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ నుంచి తమ నాయకురాలు భూమా అఖిలప్రియ గెలిస్తే కాలినడకన తిరుమలకి వస్తానని వెంకటేశ్వరస్వామి కి మొక్కు తీర్చుకుంటానని ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు నాగ శ్రీనివాసులు కోరుకున్నారు. భూమా అఖిల ప్రియ గెలిచి సంవత్సరం అయిన సందర్భంగా ముక్కుబడి తీర్చుకొనుటకు కాలినడకన తిరుమలకు గురువారం ఆర్ల నాగ శ్రీనివాసులు బయలుదేరారు.



## మొహర్రం వేడుకలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

**జొన్నగిరి ఎస్సై యన్.సి మల్లికార్జున**

**తుగ్గలి,మేజర్ న్యూస్ :** జొన్నగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో మొహర్రం వేడుకలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జొన్నగిరిసబ్ఇన్స్పెక్టర్ యన్.సిమల్లికార్జున అన్నారు. గురువారం సమావేశంలో అయన మాట్లాడుతూ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా ఎటువంటి గొడవలు లేకుండా చేసుకోవాలని పండుగ నిర్వహించాలంటే పోలీసుల నుండి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా వేడుకలు నిర్వహిస్తే ఏమైనా సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



## ఎమ్మెల్యేపై కోనేరు దుష్ప్రచారం మనుకోవాలి- టీడీపీ నాయకులు


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి అహర్నిశలు శ్రమించి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చేస్తుంటే దాన్ని జీర్ణించుకోలేక కోనేరు నాగేంద్ర ప్రసాద్ చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలి టీడీపీ నాయకులు కౌన్సిలర్ రాందాస్ గౌడ్, బందే నవాజ్, దామా నరసింహులు, బండా నరసప్పలు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఫోటోతో లెటర్ ప్యాడ్ చేతి రత్తులు రాసే వ్యక్తి తెలుగుదేశం పార్టీ ఎలా అవుతారని ప్రశ్నించారు. ఆరోపణలు చేసే ముందు నిజాలు తెలుసుకోవాలని హెచ్చరించారు. గత పాలనలో, ఎమ్మెల్యే బీవీ పాలనలో అభివృద్ధి ఎలా ఉందో తెలుసుకోవాలన్నారు. సామాజి క మద్యమాల్లో వదిలి ప్రజల మధ్యలో వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి పుణ్యంతో ఒకసారి కౌన్సిలర్‌గా గెలిచిన కోనేరు రెండోసారి పోటీ చేస్తే ప్రజలు తిరస్కరించారన్నారు. మా పార్టీ అంతర్గత విషయాలు మాట్లాడే అర్హత కోనేరుకు లేదన్నారు. ప్రజల పట్ల, రాజకీయాల పట్ల చిత్తశుద్ధి లేదని, ఎమ్మెల్యే పై అసత్య ప్రచారా లు చేస్తే మాత్రం సహించేది లేదన్నారు.

## మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు షోకాజు నోటీసులు

(మొదటిపేజి తరువాయి..)

ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి రూ.3,27,17,209లు వసూలు చేయకపోవడంతో కమీషనర్ గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సొమ్మును మూడురోజుల్లోపు వసూలు చేసి కార్పొరేషన్‌లో జమ చేయాలని ఆయన ఆదేశించారు. ఉద్యోగులు మూడురోజుల సమయంలో వసూలు చేస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి..



మాట్లాడుతున్న ఆర్డీఓ

**పత్తికొండ, మేజర్‌న్యూస్ :** మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఆర్డీఓ భరత్ నాయక్, డిఎస్పీ వెంకట్రామయ్య, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాలనుండి అంబేద్కర్ సర్కిల్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తన బంగారు భవవిష్యత్తు చేసుకోవద్దన్నారు. ఈకార్యక్రమంలో సిఐలు జయన్న, పులిశేఖర్ గౌడ్, ఎక్సైజ్ సిఐ సువర్ణ, ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, తెదేపా నాయకులు లోక్‌నాథ్, కడవల సుధాకర్, బి.టి. గోవింద్, దస్తగిరి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గుంతకందాల గ్రామంలో కార్డెన్ సెర్చ్

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని గుంతకందాల గ్రామంలో గురువారం వెలుగోడు ఎస్ఐ సురేష్, పాములపాడు ఎస్ఐ సురేష్ కలిసి సిబ్బందితో గుంతకందాల గ్రామంలో కార్డన్‌సెర్చ్ చేసి సుమారు 20 వాహనాలను చెక్ చేసి కేసులు వ్రాశారు. ఏలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న మద్దిలేటిని అరెస్టు చేసి కేసును నమోదు చేశారు. అతని వద్ద నుంచి 19 మద్యం క్వార్టర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.



# సీఎం సహాయ నిధి పేదలకు వరం

**బాధితులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీవీ**


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** పేదలకు ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరమని ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి అన్నారు.గురువారం స్థానిక కుర్ని కళ్యాణ మండపంలో నియోజకవర్గ పరిధిలోని బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. వడ్డే తరుణ్ 35 వేలు, మడుగుండు చందనకు 28 వేలు, తగారం ప్రవీణ్ 26 వేలు, చాకలి భీమన్న 15 వేలు, బండ రాములమ్మ 31 వేలు, బోయ సంజన్న 1లక్ష 10 వేలు, శాంతమ్మ 1లక్ష 50 వేలు, కేటికే పీరన్న 98 వేలు, మొహమ్మద్ లియన్ రూ.1 లక్ష 78 వేలు, పల్లవి సీమన్ 50 వేల 878, బోయ పెద్ద హనుమంతు రూ.59 వేల 580, కీలశృతికు 2 లక్షలు మొత్తం 12 మంది భాదితులకు 9 లక్షల 84 వేల చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన మాజీ జడ్పీ చైర్మెన్ బత్తిన

**ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్ ఏర్పాటు కై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని వినతి**



**తుగ్గలి,మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషను గురువారం కర్నూల్ కలెక్టరేట్‌లో మాజీ జడ్పీచైర్మన్‌బత్తిన వెంకటరాముడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామలింగయ్య పల్లె గ్రామములోప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్ ఏర్పాటు కై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ను ఆయన కోరారు. ఇప్పటికే ఈ విషయం శాసనసభ్యులు శ్యాం కుమార్ దృష్టి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో బీసీ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, అందువల్ల ప్రభుత్వ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. అందుకు అవసరమైన స్థలాన్ని కూడా తాము సమకూర్చామని తెలిపారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలో పంపుతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## ఐఐఐటి సీటు సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి ప్రదానం

**ప్రదానం చేసిన చాగలమర్రి యస్.టీ.యు. బృందం**




**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** ఐఐఐటి సీటు సాధించిన చాగలమర్రిబాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సమీరాకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తరపున 5 వేల రూపాయలు బహుమతి ప్రధానోపాధ్యాయులు జీవయ్య మరియు సీనియర్ ఉపాధ్యాయులు ఐడి కృష్ణశాస్త్రి చాగలమర్రి ఎస్టియు బృందం అందజేశారు.అనంతరం ప్రధానోపాధ్యాయుడు జీవయ్య మాట్లాడుతూ చదువులో మంచి గుర్తింపు వచ్చినందుకు విద్యార్థిని ప్రోత్సహించడం ఎస్టీయూ సంఘం చేసిన కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు రాష్ట్ర అదనపు దాన కార్యదర్శి శివ శంకర్ ,జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, ఉస్మాన్, జిల్లా కౌన్సిలర్స్ శ్రీనాథ్ రెడ్డి సురేష్ అప్ప, జెడ్ జేసివిజయకుమార్, వెంకటేశ్వర్లు, జనార్ధన్ వర్మ, నిరంజన్, ఫ్లోరెన్స్, దేవమణి, నిర్మల కుమారి, భవాని, జయన్న తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో స్థానం సంపాదించిన విద్యార్థినులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డలోని జిల్లా పరిషత్ బాలికల ప్రభుత్వఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతిలో అత్యధిక మార్కులు సంపాదించిన ముగ్గురు విద్యార్థినులు ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి పాఠశాలకే గర్వకారణంగా నిలిచారని పాఠశాల హెచ్.ఎం.పర్వత్ నసీమ్‌తెలిపారు.గురువారం ఆమె మాట్లాడుతూ సాదియా, నమ్రుత, సుమయా అనే విద్యార్థులు పదవ తరగతిలో అత్యంత ప్రతిభ కనపరిచి మంచి మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు.ఈసందర్భంగావారినిహెచ్.ఎం.నసీం అభినందించారు.

## ఎమ్మెల్యే బీవీ పై నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పై ఎమ్మిగనూరు పట్టణంకు చెందిన మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని మండల టీడీపీ నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్యనాయుడు, బేతాలబడేసా, పట్టణ అధ్యక్షుడు రహంతుల్లా, రంగస్వామినాయుడు, కోరారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికై కోనేరు నాగేంద్ర తప్పుడు ప్రకటనలు మానేవేస్తే మంచిదని తెలిపారు. నియోజకవర్గంను అభివృద్ధి పథం వైపునడిపిస్తున్న బీవీ పై బురదచల్లడం మంచిదికాదన్నారు. నీకు చేతనైతే మాజీ సీఎం జగన్ చేసే అఘాయిత్యాలను గురించి ప్రజలకు తెలపాలని సూచించారు.అడ్వకేట్ చంద్రశేఖర్, షేక్షావలి, మార్కెట్యార్డు డైరెక్టర్ ఫకృద్దీన్, మదినా,కులుమాలరాముడు, కొత్తింటీ ఫకృద్దీన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# మోడీ సర్కార్ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం

**:– సిపిఐ ఎంఎంల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున**



మాట్లాడుతున్న నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** మోడీ సర్కార్ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని అంబేద్కర్ భవన్ నందు జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా కార్యదర్శివి.మల్లికార్జున అధ్యక్షత వహించగా ముఖ్యవక్తగా విచ్చేసిన పిడీఎస్‌యు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషఫణి మాట్లాడుతూ దేశంలో ఫాసిజం రూపంలో నియంతృత్వం దారుణంగా అమలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఎమర్జెన్సీకి 50ఏళ్లు నిండిన సందర్భంగా ఫాసిస్టుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. నేటి తరం అత్యంత దుర్మార్గమైన ఎమర్జెన్సీ నిర్బంధం గురించి విన్న వాళ్లే కానీ చూసిన వాళ్లే కానీ చూసిన వాళ్లు కాదన్నారు. అనేక ప్రజా పోరాటాల ఫలితంగా ప్రజాస్వామ్య ఉద్యమాల కారణంగా ఎమర్జెన్సీని నాడు ఎత్తి వేశారని గుర్తు చేశారు. నేడు బిజెపి పాలనలో అంతకుమించి నిర్బంధం అమలు జరుగుతుందన్నారు. కగార్ పేరుతో వందలమందిని కాల్చి చంపుతున్నారని, ఊఫాపేరుతో వేలమందిని జైల్లో బంధిస్తున్నారని అన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేకిస్తూ ఈ నెల 26న ఫాసిస్టు వ్యతిరేక దినంగాజరుపుకోవాలని న్యూడెమోక్రసీ పార్టీ పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండ బిజెపి నియంతృత్వ విధానాలను బలపరుస్తుందని వీటికి వ్యతిరేకంగా కూడా పోరాడాలన్నారు. అనంతరం ఏఐకె ఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ రాజు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, ఏఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటస్వామి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇప్ట ప్రసాద్, పట్టణ పేదల సంఘం కన్వీనర్ రాజు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అఖండ, ఉపాధ్యక్షుడు రమణ నాయకులు మనోహర్, సురేష్ బాబు, రవి, బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, విద్యాకమిటీ చైర్మెన్ మధ్య వాగ్వాదం

- **మేరీట్ విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించేది లేదు**
- **రాజీనామాకు సిద్ధపడిన చైర్మెన్**
- **విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆగ్రహం**


పాఠశాల ప్రిన్సిపల్, చైర్మెన్ మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షహనాపర్విన్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గౌస్ మధ్య విద్యార్థుల సీట్ల ఎంపిక విషయంలో గురువారం తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. వారి మధ్య మాటకు మాట పెరగడం వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో చైర్మన్ రాజీనామకు సిద్ధపడ్డాడు. కొందరు చైర్మన్ ను వారించారు. మోడల్ స్కూల్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చైర్మన్ ఆరోపించారు. 6,7,8, ఇంటర్మీడియట్ తరగతులకు మేరిట్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయకుండా ప్రిన్సిపల్ తన ఇష్టానుసారం వ్యవహరిస్తు తక్కువ మార్కులు వచ్చిన వారిని ఎలా ఎంపిక చేశారని చైర్మన్ ప్రశ్నించారు. తాను మాత్రం నియమ నిబంధనల ప్రకారమే ఎంపిక చేశానని ప్రిన్సిపల్ వాధించారు. గోనెగండ్లకు చెందిన మం జూనాథ్ అనే ఆరవతరగతి విద్యార్థి మోడల్ స్కూల్ లో నిర్వహించి న ప్రవేశ పరీక్షలో 66 మార్కులు వచ్చాయి ఆ పిల్లవాడిని కాదని తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి ఎట్లా సీటు కేటాయించారని చైర్మన్ ప్రశ్నించారు. విదార్థి సంఘాల నాయకులు కలుగజేసుకొని పాఠశాలలో ప్రిన్సిపల్ పర్యవేక్షణ సక్రమంగా లేదని గత వారం రోజుల క్రితం పిల్లలకు ఫుడ్ పాయిజన్ అయిందని దీనికి బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నించారు. పాఠశాల నిర్వహణలో చైర్మన్ జోక్యం చేసుకోరాదని ప్రిన్సిపల్ అనడంతో మేరిట్ విద్యార్థులకు కూడా న్యాయంగా సీట్ ఇవ్వలేని స్థితిలో పాఠశాల చైర్మన్ గా ఉండేకంటే రాజీనామ చేసి వెలతానని గౌస్ అన్నారు. పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

## కన్నతల్లినీ పుట్టిన ఊరుని మరువకూడదు-విజిలెన్స్ డిఐజి శ్రీనివాసరెడ్డి



సభలో మాట్లాడుతున్న విజిలెన్స్ డిఐజి.శ్రీనివాస రెడ్డి

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం కే. శింగవరం గ్రామంలో ప్రభుత్వ యంపీయుపి పాఠశాలను ఉన్నత పాఠశాలగా మారుస్తూ జిల్లా అధికారులు జీవో విడుదల చేసిన సంగతి తెలిసిందే.తమ గ్రామ పాఠశాల అప్ గ్రేడ్ కావడంతో గ్రామ పెద్దలు,ప్రజా ప్రతినిధులు,ప్రజలు పాఠశాల ప్రాగాణంలో ఉపాధ్యాయులతో సెలబ్రేషన్స్ జరుపుకున్నారు.ఈకార్యక్రమంలోముఖ్యతిధిగా గ్రామస్తుడు వున్నత హెూదాలో విజిలెన్స్ డిఐజి గా వున్న శ్రీనివాసరెడ్డి హాజరై ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కన్నతల్లి పుట్టినఊరును ఎప్పటికి మరువకూడదు,మనిషిగా పుట్టిన ఊరుకు ఎంతో కొంత సెవ చేసి గ్రామ అభివృద్ధికి పాటు పడి ఋణం తీసుకోవాలని సూచించారు.గ్రామ సర్పంచ్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి విజిలెన్స్ డిఐజి శ్రీనివాస రెడ్డి ఎంతగానో కృషి చేశాడని పాఠశాల అభివృద్ధిలో అయన పాత్ర ప్రథమం అని అన్నారు. యంఇఓ-2 ఆడంభాష, ఉపాధ్యాయులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి 16రోజుల పండుగ


పూజలందుకున్న అమ్మవారు

**బనగానపల్లెరూరల్ మేజర్, న్యూస్ః** బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో ఈనెల 12 నుండి 14వ తేదీ వరకు గ్రామ దేవత పెద్దమ్మ తల్లి దేవర కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ విగ్రహాన్ని బనగానపల్లె సమీపంలోని యాగంటిపల్లె గ్రామ సరిహద్దు లో కూర్చోబెట్టి మండపం నిర్మించి అక్కడ కొలువైన అమ్మ వారికి 16 రోజులు పండుగ సందర్భంగా గురువారంనా డు బోనాలు సమర్పించి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా రైతు సంబరాలను నిర్వహించి వృషభాల బలప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై తమ మొక్కులు తీర్చుకొని రైతు సంబరాలను వీక్షించారు. వచ్చిన భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ గావించారు.

## కూటమి మోసాలను ప్రజలలోకి తీసుకెళ్తా..

**వైకాపా ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వరరెడ్డి**


ఎన్నికైన బి.వెంకటేశ్వరరెడ్డి

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం గడిచిపోతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, ప్రజలకు వాగ్దానాలను అమలు చేయకపోవడం దారుణమని, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను మండలంలోని ప్రతి గ్రామానికి తిరిగి ప్రజలలోకి తీసుకెళ్తానని వైయస్ఆర్‌సిపి ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆదేశాల మేరకు వెల్దుర్తి మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వరరెడ్డిని వైయస్ఆర్‌సిపి ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు గురువారం వైయస్ఆర్‌సిపి తాడేపల్లి కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా బి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వైయస్ఆర్‌సిపి ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా కొణిదెల..!

- రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు ..
- త్రాగునీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ శంకుస్థాపన
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదేశాలను నెరవేరుస్తాం..
- నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





**నందికొట్కూర రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో... ప్రజల యొక్క అవసరాలు, ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పథకాలను అమలుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. గురువారం నందికొట్కూరు మండల పరిధిలోని కొణిదెల గ్రామంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత నిధులు రూ.50 లక్షలతో 90వేల లీటర్ల త్రాగునీటి ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎంపీ శబరి, నందికొట్కూరు, రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు గిత్త జయసూర్య, అరవ శ్రీధర్, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ లు పాల్గొని భూమిపూజ నిర్వహించి పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.. గ్రామానికి అవసరమైన 90 వేల లీటర్ల తాగునీటి ట్యాంకుకు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమానికి మీ అందరితో కలిసి పాల్గొనడం చాలా సంతోషమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ,ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి చక్కటి ప్రణాళికలతో గ్రామస్థాయి వరకు పథకాలను అమలు చేసేలా అనునిత్యం పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. గత ఏడాది కాలంగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మన జిల్లాలో చేసుకున్నాం, ప్రజల యొక్క జీవన ప్రమాణాలు పెరగాలి, ఉపాధి పెరగాలి, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని, గ్రామాలు ఎప్పుడూ కళకళలాడుతూ ఉండాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మనము వస్తువులను సమకూర్చుకోవడం ఒక ఎత్తు అయితే, సొంత నిధులతో గ్రామ అవసరాలకు, ప్రజల అవసరాలకు ఇవ్వాలంటే చాలా పెద్ద గొప్ప మనసు ఉండాలన్నారు. ఉపముఖ్యమంత్రి తన ఇంటి పేరు ఉన్న గ్రామానికి పెద్ద మనసుతో స్వయంగా తన పేషీ నుంచి ఈ గ్రామంలో 90 వేల లీటర్ల తాగు ట్యాంక్ నిర్మించడానికి సొంత నిధులు కలెక్టర్ కి పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చాం, టెండర్స్ పిలిచి ఫైనలైజ్ చేసి ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ ద్వారా పనిని ప్రారంభించడం జరిగిందని. కొణిదెల గ్రామాన్ని ఆదర్శంగా అందరికీ చూపించాలనీ ఉప ముఖ్యమంత్రి సూచించారని కలెక్టర్ తెలిపారు. నాలుగు నెలల్లో పని పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీకి సూచించామన్నారు. పనులు పూర్తయ్యాక ప్రారంభోత్సవ సమయంలో ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా గ్రామస్తులకు అందించే విధంగా కార్యక్రమానికి ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ శబరి మాట్లాడుతూ... గత ఐదు ఏళ్లలో మన ఊరు, మన నియోజకవర్గం ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందో మీ అందరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఎప్పుడో ఎన్నికల ముందు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కొణిదెల గ్రామానికి వచ్చి ఇక్కడి చెట్టు కింద కూర్చొని గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని , ఇచ్చిన హామీ ప్రకారం సొంత నిధులు రూ.50 లక్షలు గ్రామానికి ఇచ్చారు. రాజకీయాలలో ప్రజా సమస్యలపై స్పందించే ఇలాంటి నాయకులు కావాలి. ప్రజాసేవ చేసే నాయకులు మనకు ఎంతో ముఖ్యం. ఉప ముఖ్యమంత్రి పంపిన నిధులను గ్రామానికి అవసరమైన విధంగా సరైన పనిని కలెక్టర్ గ మంజూరు చేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. అంతేగాక నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలవడం జరిగిందని. ఈ సందర్భంగా గతంలో గ్రామానికి విచ్చేసిన సందర్భాన్ని గుర్తు చేయడం జరిగింది. ఇందుకు గ్రామ ప్రజలందరి తరఫున ఉప ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అనంతరం ప్రభుత్వ విప్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ కొణిదెల గ్రామంలో ఉపముఖ్యమంత్రి సొంత నిధులతో చేపట్టిన 90 వేల లీటర్ల త్రాగునీటి ట్యాంక్ భూమి పూజ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు .ఏదైనా మాట ఇస్తే ఉప ముఖ్యమంత్రి దాన్ని నిలబెట్టుకుంటారు. కేవలం డబ్బులు ఇవ్వడమే కాదు ఆ పనిని నాణ్యతగా పూర్తి చేసేంతవరకు పర్యవేక్షణ చేస్తారు. అంతేగాక రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఈ కొణిదల గ్రామానికి వచ్చి.. తన ఇంటిపేరు ఉన్న గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించడానికి సొంత నిధులు రూ.50 లక్షలు ఇవ్వడం ఆయనకు ఉన్న గొప్ప మనసుకు ఉదాహరణ. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నవీన్, జిల్లా, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# స్వర్ణ రథంపై శ్రీశైల మల్లన్న

- ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆది దంపతులకు ప్రత్యేక పూజలు
- వర్షం కారణంగా స్వర్ణ రథోత్సవం నిలుపుదల
- ఆకట్టుకున్న కళా బృందాల కోలాటం







**శ్రీశైలం,మేజర్ న్యూస్ :** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లు స్వర్ణరథంపై పూజలందుకున్నారు.ఆరుద్రోత్సవంలో భాగంగా గురువారం వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,అన్నాభిషేకం,విశేష పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా అర్చక స్వాములు లోక కల్యాణాని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు.తరువాత రథారూఢులైన శ్రీస్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు.వర్షం కారణంగా స్వర్ణ రథోత్సవాన్ని నిలుపుదల చేశారు.కాగా సంప్రదాయ కళల పరి రక్షణలో భాగంగా రథోత్సవం వద్ద పలు కళా బృందాల కోలాటం,డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి.అర్చక స్వాములు, వేదపండితులు, పలు విభాగాల అధికారులు, పర్యవేక్షకులు,తదితర సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

# సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : మంత్రి




మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** పార్టీలకు అతీతంగా అభివృద్ధి ధ్యే యంగా ప్రజా సమస్యలను తీరుస్తూ గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి టౌన్‌స్థాయి నాయకులంద రూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు త్వరితగతిన తీర్చాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపుని చ్చారు. నంద్యాల టీడీపీ పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నియామక ప్రక్రియకు టీడీపి అధిష్టానం అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవ ర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ అధిష్టానం నం ద్యాలకు ఆరుమంది అబ్జర్వర్లను నియమించడం జరిగిందని వారిని నంద్యాల నియోజకవర్గానికి పరిచయం చేయడం జరిగింది. రెగ్యులర్ అబ్జర్వర్‌గా రవికుమార్, ఎన్నికల అబ్జర్వర్ 1గా నరసనాయుడు, 2గా నబిసాబ్, గోస్పాడు మండల అబ్జర్వర్‌గా నంద్యాల రామేశ్వర్‌రెడ్డి, నం ద్యాల మండల అబ్జర్వర్‌గా అన్సర్‌బాషా, నంద్యాల టౌన్ అబ్జర్వర్‌గా ఫణి రాజ్‌లను నియమించడం జరిగిందన్నారు. టీడీపీ పూర్తిగా ప్రక్షాళన చేసి పూర్తిస్థాయి కమిటీలను వేసి అన్ని కమిటీలను వేయాలని తెలిపారు. రాష్ట్ర నామినేటర్ పోస్టుల్లో నిరాశ ఎదురైన వారికి పార్టీ పోస్టులలో నియ మించాలని పార్టీ అధిష్టానం తెలియజేసినట్లు తెలిపారు. ఈకార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు శ్రీరాము లు, ఏవిఆర్ ప్రసాద్, మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్‌రెడ్డి, గోస్పాడు మండల కన్వీనర్ తులశీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి



# మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తా

## – ఎంపీ బైరెడ్డి శబరి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల మార్కెట్ యార్డు అభివృద్ధికి నావంతు సహాయ, సహకారాలు అందిస్తానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి అన్నారు. ఎంపీ బైరెడ్డి కార్యాలయంలో ఇటీవల మార్కెట్ యార్డు కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు ఎంపీ బైరెడ్డి శబరిని మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, వైస్ చైర్మన్ రంగ ప్రసాద్, డైరెక్టర్లు పిట్టల మదార్, స్వామి నాయక్, రవి, నూర్‌బాష, తదితరులు ఎంపీని కలిసి సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ నంద్యాల మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీపై నమ్మకం ఉంచి మంచి పదవులు ఇచ్చారన్నారు. మార్కెట్ యార్డు అంటేనే రైతుల యార్డు అని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.



ఎంపీ శబరిని సన్మానిస్తున్న మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు